సూర్య నేటి దినపత్రిక
www.suryaa.com
18వ వసంతంలోకి..
www.suryaa.com

EVENING EDITION

నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శనివారం
05-04-2025
పేజీలు: 02


## ఐపీఎల్‌లో నేడు

చెన్నై vs ఢిల్లీ
చెన్నై 3.30

పంజాబ్ vs రాజస్తాన్
ముల్లన్‌పూర్ 3.30
స్టార్ స్పోర్ట్స్, జియో హాట్ స్టార్‌లో..

## ఐపీఎల్ పాయింట్ల పట్టిక

| టీమ్ | మ్యాచ్‌లు | విన్ | లాస్ | పాయింట్స్ |
|---|---|---|---|---|
| పంజాబ్ | 2 | 2 | 0 | 4 |
| ఢిల్లీ | 2 | 2 | 0 | 4 |
| ఆర్సీబీ | 3 | 2 | 1 | 4 |
| గుజరాత్ | 3 | 2 | 1 | 4 |
| కొల్‌కత్తా | 4 | 2 | 2 | 4 |
| లక్నో | 4 | 2 | 2 | 4 |
| ముంబై | 4 | 1 | 3 | 2 |
| చెన్నై | 3 | 1 | 2 | 2 |
| రాజస్తాన్ | 3 | 1 | 2 | 2 |
| సన్‌రైజర్స్ | 4 | 1 | 3 | 2 |

ఆరెంజ్ క్యాప్ 201 ఐపీఎల్ అత్యధిక రన్స్

పర్పుల్ క్యాప్ 09 ఐపీఎల్ అత్యధిక వికెట్స్




## ఎస్బీఐపై తిరగబడ్డ ఖాతాదారులు

వరంగల్ జిల్లా, రాయపర్తి మండల కేంద్రంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)కు కొంతమంది ఖాతాదారులు తాళం వేశారు. చోరీకి గురైన బంగారం విషయంలో ఖాతాదారులు ఈ చర్యకు దిగారు. గత సంవత్సరం నవంబర్ 19వ తేదీన ఈ బ్యాంకులో దొంగతనం జరిగింది. ఈ ఘటనలో 497 మంది ఖాతాదారులకు చెందిన 16 కిలోలకు పైగా బంగారం చోరీకి గురైంది.తమ బంగారాన్ని తిరిగి ఇవ్వాలని ఖాతాదారులు ఆ రోజు నుండి బ్యాంకు చుట్టూ తిరుగుతున్నారు. బ్యాంకు అధికారులు వాయిదా వేస్తూ వస్తుండటంతో బాధిత ఖాతాదారులు పలుమార్లు ఆందోళన నిర్వహించారు. ఏప్రిల్ 4వ తేదీన చెల్లింపులు జరుపుతామని ఉన్నతాధికారులు హామీ ఇచ్చారు.

## గ్రూప్ 1 నియామకాలకు తొలిగిపోయిన అడ్డంకులు

రాష్ట్రంలో గ్రూప్ 1 నియామకాలకు లైన్ క్లియర్ అయింది. తెలంగాణ సర్కార్ జారీ చేసిన జీఓ 29 చెల్లుబాటుపై దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసింది. జీఓ 29 చెల్లుబాటును సవాల్ చేస్తూ గ్రూప్ 1 అభ్యర్థులు అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీనిపై తాజాగా విచారణ చేపట్టిన న్యాయస్థానం పిటిషన్‌ను కొట్టివేసింది. కాగా, దివ్యాంగుల రిజర్వేషన్లకు సంబంధించి 2022లో జారీ చేసిన జీఓ 55 కు సవరణ తీసుకొస్తూ ఫిబ్రవరి 28న తెలంగాణ సర్కార్ జీఓ 29ను జారీ చేసింది. దీనిని రద్దు చేయాలని కోరుతూ గ్రూప్ 1 అభ్యర్థులు సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. తాజాగా పిటిషన్ కొట్టివేతతో గ్రూప్ 1 నియామకాలకు అడ్డంకి తొలగిపోయింది. ఇక ఇప్పటికే టీజీపీఎస్సీ గ్రూప్ 1 జనరల్ ర్యాంకింగ్ జాబితాను విడుదల చేసింది.





### పాన్ కార్డు ఆధార్ కార్డ్ లింక్‌కు..


# డిసెంబర్ 31 డెడ్‌లైన్

పాన్‌కార్డు హోల్డర్లకు కేంద్ర ప్రభుత్వం కీలక సూచన చేసింది. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీని ఉపయోగించి శాశ్వత ఖాతా సంఖ్య పొందిన వారు తమ పాన్‌కార్డును ఆధార్ నంబర్‌తో తప్పనిసరిగా అనుసంధానం చేసుకోవాలని సూచించింది. ఈ ప్రక్రియను పూర్తి చేయడానికి 2025 డిసెంబర్ 31ని గడువుగా నిర్దేశించింది. ఈ మేరకు కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు తాజాగా ఒక నోటిఫికేషన్‌ను జారీ చేసింది. 2024 అక్టోబర్ 1 లేదా అంతకంటే ముందు ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీని సమర్పించి పాన్ తీసుకున్న వారు ఈ గడువు లోపు ఆధార్‌తో అనుసంధానం చేయాల్సి ఉంటుంది, లేకపోతే వారి పాన్‌కార్డు నిరుపయోగంగా మారే ప్రమాదం ఉందని స్పష్టం చేసింది. ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ ఐడీ అనేది ఆధార్ కార్డు జారీ కాని వారికి తాత్కాలికంగా అందించే 28 అంకెల సంఖ్య. ఈ ఐడీతో పాన్ కార్డు తీసుకున్న వారు, తమ ఆధార్ కార్డు జారీ అయిన తర్వాత దాన్ని పాన్‌తో లింక్ చేయడం ద్వారా తమ వివరాలను ధ్రువీకరించాలి. ఈ చర్య ద్వారా నకిలీ పాన్ కార్డులను అరికట్టడం, ఆర్థిక లావాదేవీలలో పారదర్శకతను పెంచడం కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. గతంలో పాన్-ఆధార్ లింకింగ్ గడువు 2023 జూన్ 30తో ముగిసినప్పటికీ, ఎన్‌రోల్‌మెంట్ ఐడీ వాడిన వారికి అదనపు సమయం ఇవ్వడం జరిగింది. ఈ విషయంలో ఎటువంటి జరిమానా లేకుండా ఈ అవకాశాన్ని అందిస్తున్నారు. పాన్-ఆధార్ అనుసంధానం కోసం ఆదాయపు పన్ను శాఖ అధికారిక పోర్టల్‌ను (www.incometax.gov.in) ఉపయోగించవచ్చు. ముందుగా పోర్టల్‌లోకి లాగిన్ కావాలి. లేదా రిజిస్టర్ కావాలి. అక్కడ 'లింక్ ఆధార్' పై క్లిక్ చేయాలి. మీ పాన్ నంబర్, ఆధార్ నంబర్, పేరు వంటి వివరాలను నమోదు చేయాలి. ఓటీపీ ధ్రువీకరణ పూర్తి చేసి సమర్పించాలి. ఈ ప్రక్రియ ఆన్‌లైన్‌లో సులభంగా పూర్తి చేయొచ్చు. ఇంకా ఎలాంటి పెనాల్టీ లేదు. ఆన్‌లైన్ సౌలభ్యం లేని వారు సమీపంలోని పాన్ సర్వీసు సెంటర్ లేదా ఆధార్ సేవా కేంద్రాన్ని సందర్శించి ఈ ప్రక్రియను పూర్తి చేయవచ్చు. అయితే, సాధారణ పాన్-ఆధార్ లింకింగ్ కోసం 2023 గడువు ముగిసిన తర్వాత రూ.1,000 జరిమానా విధిస్తున్నారు. ఎన్‌రోల్‌మెంట్ ఐడీ వాడిన వారికి ఈ జరిమానా నుంచి మినహాయింపు ఉంది. డిసెంబర్ 31, 2025 లోపు ఆధార్‌తో పాన్‌ను అనుసంధానం చేయకపోతే, ఆ పాన్ కార్డు నిరుపయోగంగా మారుతుంది. దీని వల్ల బ్యాంకు లావాదేవీలు, ఆదాయపు పన్ను రిటర్న్స్ దాఖలు, పెట్టుబడులు వంటి ఆర్థిక కార్యకలాపాలు ఆగిపోయే ప్రమాదం ఉంది. అదనంగా ఇనాక్టివ్ అయిన పాన్ తిరిగి యాక్టివ్ చేయాలంటే.. మళ్లీ పెనాల్టీ కట్టాల్సి వస్తుంది. అందుకే.. గడువులోగా ఈ పని పూర్తి చేయడం మంచిది.

## చెన్నై కెప్టెన్‌గా ధోనీ



ఐపీఎల్ అభిమానులకు గుడ్ న్యూస్. మహేంద్ర సింగ్ ధోనీ మళ్లీ చెన్నై సూపర్ కింగ్స్ కెప్టెన్సీ చేపట్టనున్నాడు. అది కూడా సొంతమైదానంలో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగే మ్యాచ్‌లో మహీ భాయ్ సారథిగా వ్యవహరించనున్నాడు. కారణం ఏంటంటే.. . ప్రస్తుతం కెప్టెన్‌గా ఉన్న రుతురాజ్ గైక్వాడ్ గాయపడ్డాడు. రాజస్థాన్ రాయల్స్‌తో మ్యాచ్ సమయంలో ఎడమ మోచేతికి గాయంతో బాధ పడిన రుతురాజ్.. ఢిల్లీతో మ్యాచ్‌కు అందుబాటులో ఉండకపోవచ్చు. అందుకే.. మాజీ నాయకుడు అయిన ధోనీకే మళ్లీ పగ్గాలు అప్పగించాలని యాజమాన్యం భావిస్తోంది. శనివారం చెపాక్ స్టేడియంలో చెన్నై జట్టు ఢిల్లీతో తలపడనుంది. అదే జరిగితే.. మరోసారి కెప్టెన్ కూల్ తాలా తనదైన వ్యూహాలతో సీఎస్కేను విజయాల బాట పట్టించడం ఖాయం. ప్రస్తుతం ఒకే ఒక విజయంతో.. పాయింట్ల పట్టికలో 8వ స్థానంలో ఉన్న చెన్నైకి ధోనీ సారథ్యం వహించడం శుభసూచకం అంటున్నారు విశ్లేషకులు. చెన్నై సూపర్ కింగ్స్‌కు 5 ఐపీఎల్ ట్రోఫీలు అందించిన ధోనీ.. నిరుడు స్వచ్ఛందంగా సారథ్య బాధ్యతల నుంచి వైదొలిగాడు. తన వారసుడిగా ఓపెనర్ రుతురాజ్ గైక్వాడ్‌ను ఎంపిక చేసిన మహీ.. అతడిని తన అంతటి కెప్టెన్ చేసే పనిలో నిమగ్నమయ్యాడు. 42 ఏళ్లున్న ధోనీకి బహుశా ఇదే ఆఖరి సీజన్ కావచ్చు. దాంతో, ఈ ఎడిషన్‌ను విజయంతో ముగించాలనే పట్టుదలతో ఉంది సీఎస్కే టీమ్.




### బాక్సాఫీస్ దగ్గర 'వార్'

## డిక్లేర్ చేసిన 'కూలీ'

తమిళ సూపర్ స్టార్ రజినీకాంత్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'కూలీ' ఇప్పటికే శరవేగంగా షూటింగ్ ముగించుకుంది. ఈ సినిమాను దర్శకుడు లోకేశ్ కనగరాజ్ తెరకెక్కిస్తుండగా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. ఇక ఈ సినిమాలో రజినీకాంత్ మరోసారి తన పర్ఫార్మెన్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకోవడం ఖాయమని చిత్ర యూనిట్ ధీమా వ్యక్తం చేస్తుంది. ఇప్పటికే రిలీజ్ అయిన పోస్టర్స్, సాంగ్ ఈ మూవీపై మంచి అంచనాలు క్రియేట్ చేశాయి. కాగా ఈ సినిమా నుంచి తాజాగా ఓ సాలిడ్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ చిత్రాన్ని ఆగస్టు 14న గ్రాండ్ రిలీజ్ చేయబోతున్నట్లు చిత్ర యూనిట్ తెలిపింది. ఓ సాలిడ్ పోస్టర్ ద్వారా ఈ విషయాన్ని మేకర్స్ వెల్లడించారు. ఆగస్టు 14న రిలీజ్ అవుతున్నట్లు ఇప్పటికే బాలీవుడ్ క్రేజీ స్పై థ్రిల్లర్ మూవీ 'వార్-2'ను అనౌన్స్ చేశారు.

## ఆ సినిమాతో నా జీవితమే మారిపోయింది

ప్రపంచ మానవాళి అంతా.. గత ఏడాదికి వీడ్కోలు పలికి, కొత్త ఏడాదికి స్వాగతం పలికేశారు. గత జ్ఞాపకాలను మనసులోనే దాచుకొని, కొత్త ఏడాది ఇచ్చే అనుభూతుల కోసం ఎదురుచూస్తున్నారు. ఇటీవల రష్మిక పాల్గొన్న ఓ ఇంటర్వ్యూలో ఇన్నాళ్ల జీవితంలో మీకు గుర్తుండిపోయిన మధుర జ్ఞాపకం ఏంటి? అనే ప్రశ్న రష్మికకు ఎదురైంది. దానికి ఆమె సమాధానమిస్తూ.. '2016 డిసెంబర్ 30.. ఆ రోజును నా జీవితంలో మరిచిపోలేను. ఎందుకంటే.. నా తొలి సినిమా 'కిరాక్ పార్టీ' విడుదలైంది ఆ రోజే. ఆ సినిమాతో నా జీవితమే మారిపోయింది. ఆ సినిమాతో కన్నడలో బిజీ అయ్యాను. నా టాలీవుడ్ డెబ్యూ 'చలో' సినిమా ఛాన్స్ నాకొచ్చిందంటే.. కారణం 'కిరాక్ పార్టీనే'. ఆ సినిమా చూసే 'చలో'లో నన్ను తీసుకున్నారు. ఆ తర్వాత నా కెరీర్ సమూలంగా మారిపోయింది. ఇప్పుడంతా నన్ను నేషనల్ క్రష్ అంటున్నారంటే.. దాని వెనుక 'కిరాక్ పార్టీ' సినిమానే ఉంది.





### తిలక్ వర్మ రిటైర్డ్ హర్ట్..

## ఎందుకో చెప్పిన హార్దిక్ పాండ్యా

ఐపీఎల్‌లో ముంబై మళ్లీ ఓడింది. నాలుగు మ్యాచుల్లో ఆ జట్టు మూడో ఓటమి చూవిచూసింది. లక్నో చేతిలో శుక్రవారం 12 రన్స్ తేడాతో ఆ జట్టు పరాజయం పాలైంది. అయితే ఛేజింగ్‌లో ముంబై బ్యాటర్ తిలక్ వర్మ .. రిటైర్డ్ హార్ట్ అయ్యాడు. మరో 7 బంతుల్లో 24 రన్స్ చేయాల్సి ఉన్న దశలో అతను రిటైర్డ్ హార్ట్‌గా వెళ్లిపోయాడు. అప్పటికే తిలక్ వర్మ 23 బంతుల్లో 25 రన్స్ మాత్రమే చేశాడు. బ్యాటింగ్‌కు అనుకూలించే పిచ్‌పై .. తిలక్ వర్మ వేగంగా స్కోర్ చేయలేకపోయాడు. దీంతో అతను రిటైర్డ్ హార్ట్ అయినట్లు కెప్టెన్ హార్దిక్ పాండ్యా తెలిపాడు. మ్యాచ్ తర్వాత ఆ నిర్ణయం గురించి పాండ్యా వెల్లడించాడు. వేగంగా స్కోర్ చేసే బ్యాటర్ కావాలి అని, కొన్ని సందర్భాల్లో క్రికెట్‌లో అలాంటి పరిస్థితి వస్తుందన్నాడు. కొన్ని సార్లు ఎంత ప్రయత్నించినా.. పరుగులు చేయడం ఇబ్బందిగా మారుతుందని హార్దిక్ తెలిపాడు. లక్నో బౌలర్ దిగ్వేశ్ రాతీ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో ముంబైకి పరుగులు రాబట్టడం ఇబ్బందిగా మారింది. దిగ్వేశ్ 4 ఓవర్లలో 21 రన్స్ మాత్రమే ఇచ్చాడు. ఇంకా కీలకమైన నమన్ ధిర్ వికెట్‌ను తీశాడతను. ఓ బ్యాటింగ్ బృందంగా తాము విఫలమైనట్లు హార్దిక్ తెలిపాడు. జట్టుగా గెలుస్తామని, జట్టుగా ఓడిపోతామని, ఒకర్ని వేలి ఎత్తి చూపడం లేదని, బ్యాటింగ్ యూనిట్ మొత్తం ఆ బాధ్యత తీసుకోవాలని, తాను పూర్తి బాధ్యత తీసుకుంటున్నట్లు పాండ్యా చెప్పాడు.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# పవన్ కేవలం రాజకీయాలకోసం మతాన్ని వాడుకుంటున్నాడు



జస్ట్ ఆస్కింగ్ అంటూ తరచుగా సోషల్ మీడియాలో ప్రశ్నలు సంధిస్తూ సెన్సేషన్ క్రియేట్ చేసే ప్రకాశ్‌రాజ్... తాజాగా ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌పై విమర్శల వర్షం కురిపించారు. ఓ యూట్యూబ్ చానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ..ఏడాది క్రితం వరకు మా తండ్రి దేవుడిని నమ్మలేదని చెప్పిన పవన్ కల్యాణ్ మాటమార్చి మా తండ్రి రాముడి బోధనలతో నన్ను పెంచాడని ఇప్పుడు చెబుతున్నాడు. నువ్వు మారుతుంటే నీతోపాటు అందరూ మారాలనుకోవడం సమంజసం కాదు. పవన్ కల్యాణ్‌కి ఓ సిద్ధాంతం అంటూ లేదు, కేవలం నోటికొచ్చినట్లు మాట్లాడటం, రోజుకో సిద్ధాంతం మార్చడం ఆయనకు అలవాటే అని ప్రకాశ్ రాజ్ అన్నారు. 'నేను సనాతన ధర్మానికి, హిందూ ఇజానికి వ్యతిరేకిని కాను. కానీ సనాతని అని చెప్పుకునే పవన్ కల్యాణ్ మాత్రం కేవలం రాజకీయ అవసరాల కోసమే మతాన్ని వాడుకుంటున్నాడు. తిరుపతి లడ్డు కల్తీ అయిందంటూ రాజకీయం చేశారు. అధికారం తన చేతిలో ఉంచుకొని, పవన్ కల్యాణ్ నిందితులను పట్టుకోకుండా ఎందుకు ప్రకటనలకే పరిమితమయ్యారు. లడ్డులో కల్తీ నెయ్యి కలిపినట్లు ఎలాంటి ఆధారాలు లేవని సుప్రీం కోర్టు సైతం వ్యాఖ్యానించింది. లడ్డు అంశాన్ని రాజకీయం చేసే ముందు వాస్తవాలు తెలుసుకోవడం మంచిది. ఇది సున్నితమైన అంశం.కోట్లాది మంది భక్తుల మనోభావాలతో చెలగాటం ఆడుతున్నావు. నీకు నిజంగానే చిత్తశుద్ధి ఉంటే టీటీడీ బోర్డు మెంబర్ల నియామకం వెనుక ఉన్న అవినీతి గురించి విచారించు. ఎందుకు పేద భక్తులు దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో నిల్చోవాలి. వీఐపీ దర్శనాలు ఎందుకు? తొక్కిసలాటకు కారణాలేమిటో గుర్తించు. నువ్వు డిప్యూటీ సీఎంవి..మాట్లాడే ముందు ఆలోచించు. ఆవేశంగా ఆలోచన లేకుండా మాట్లాడుతున్నావంటే.. నీ మాటల వెనుక ఏదో ఎజెండా ఉందని అర్థం. మీ రాజకీయ అవసరాల కోసం ఇలాంటి తప్పుడు ప్రకటనలు చేయవద్దు. నాది ఆగ్రహం, ఆక్రోశం కాదు. ప్రజల నమ్మకాలతో చెలగాటం ఆడొద్దని విజ్ఞప్తి చేస్తున్నా'' అంటూ ప్రకాశ్‌రాజ్ అన్నారు. లడ్డు వివాదం విషయంలో గతంలోనూ పవన్ కల్యాణ్‌ను ప్రశ్నిస్తూ ప్రకాశ్‌రాజ్ సోషల్ మీడియాలో పోస్టులు పెట్టిన విషయం తెలిసిందే.



## రక్తంతో పవన్ కల్యాణ్ చిత్ర పటం గీసిన డై హార్డ్ ఫ్యాన్

పవర్ స్టార్ పవన్ కల్యాణ్ ఇప్పుడు రాజకీయాల్లో బిజి బిజీగా ఉంటున్నారు. ఏపీ డిప్యూటీ సీఎంగా ప్రజా సేవలో తలమునకలై ఉన్నారు. అలాగే ఐదు శాఖలను నిర్వహిస్తూ పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారు. దీంతో ఆయన సినిమాలకు దూరంగా ఉండడం తప్పలేదు. ఇది పవన్ అభిమానులను కాస్త నిరుత్సాహానికి గురి చేస్తున్నా ప్రజలకు మరింత దగ్గరవుతోన్న తమ అభిమాన హీరోను చూసి మురిసిపోతున్నారు. పవన్ కల్యాణ్ ను ఒక్కసారైనా కలవాలని, కుదిరితే ఆయనతో ఒక ఫొటో, సెల్ఫీ తీసుకోవాలని ఎంతో మంది అభిమానులు కలలు కంటుంటారు. అయితే ప్రస్తుతం ఆయనకున్న ప్రొటోకాల్, బిజీ షెడ్యూల్ దృష్ట్యా ఇది కుదరడం లేదు. ఈక్రమంలోనే ఓ పవన్ కల్యాణ్ వీరాభిమాని చేసిన ఓ పని ఇప్పుడు అందరి హృదయాలను కదిలిస్తోంది. పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం దువ్వ గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి వెంకట హరిచరణ్ చిన్నప్పటి నుంచే పవన్ కల్యాణ్ కు వీరాభిమాని. తమ ప్రాంతానికి పవన్ కల్యాణ్ వస్తున్నాడన్న విషయం తెలుసుకున్న అతను ఎలాగైనా తమ అభిమాన హీరోను కలవాలనుకున్నాడు. అయితే ఒట్టి చేతులతో ఏం బాగుంటుంది.. ఏదైనా తీసుకెళితే బాగుంటుందనుకున్నాడు. అంతే.. తన రక్తంతో పవన్ కల్యాణ్ చిత్రం గీశాడు.రాజమండ్రి జైల్ రోడ్‌లో శుక్రవారం (ఏప్రిల్04) జరిగిన అమరావతి చిత్రకళా వీధి కార్యక్రమానికి పవన్ వస్తారని అందరు భావించారు. అయితే చివరి నిమిషంలో పవన్ పర్యటన రద్దయింది. దీంతో హరిచరణ్ నిరుత్సాహానికి గురయ్యాడు. కానీ తను రక్తంతో గీసిన పవన్ కల్యాణ్ ఫొటోను మంత్రి కందుల దుర్గేష్, డిప్యూటీ స్పీకర్ రఘురామ, ఎమ్మెల్యే ఆదిరెడ్డికి అందజేశారు. తాను పవన్ కల్యాణ్ వీరాభిమాని అని, ఆయన జన్మదినం సందర్భంగా రక్తదానం చేసినప్పుడు కొంత రక్తంతో ఈ చిత్రాన్ని వేసినట్టు హరిచరణ్ చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం ఈ ఫొటో సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీనిని చూసిన వారందరూ పవన్ అభిమానిపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

### వన్యప్రాణుల హత్యకి పాల్పడుతున్న

# సీఎం పై చర్యలు తీసుకోవాలి



కంచ గచ్చిబౌలిలోని చిట్టడవిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అత్యంత నిర్దయగా ధ్వంసం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. దీనివల్ల విలువైన వృక్ష, జంతుజాలం నష్టపోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్‌సీయూ అడవులను ధ్వంసం చేయడంతో ఓ జింక ప్రాణాలు కోల్పోయిందని, ఆ రక్తపు మరకలు కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ చేతికి అంటాయని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.వన్యప్రాణుల ఈ దారుణ హత్యపై సుప్రీంకోర్టు దృష్టి సారించాలని తాను కోరుతున్నానని ఆయన అన్నారు. కంచ గచ్చిబౌలిలో 100 ఎకరాల్లో చెట్లను నరికివేయడంతో హెచ్‌సీయూ సౌత్ క్యాంపస్ హాస్టల్ వైపు ఒక జింక వచ్చిందని తెలిపారు. జింకను చూడగానే కుక్కలు మొరుగుతూ దానిపై విచక్షణారహితంగా దాడి చేశాయని ఆయన పేర్కొన్నారు. ఈ దాడిలో జింక తీవ్రంగా గాయపడటంతో హెచ్‌సీయూ విద్యార్థులు, సిబ్బంది వెటర్నరీ ఆసుపత్రికి తరలించారని, కానీ అది మృతి చెందిందని ఆయన తెలిపారు.ప్రస్తుతం చాలా జింకలు జనావాసాల్లోకి వస్తున్నాయని, వాటిని పట్టణవాసులు ఆదరించి నీళ్లు అందిస్తున్నారని ఆయన చెప్పారు. మూడు రోజుల్లో 100 ఎకరాల్లో పచ్చని చెట్లను నరికివేయడంతో రేవంత్ రెడ్డి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని ఆయన అన్నారు. పర్యావరణానికి హాని కలిగించే విధంగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆయన ఆరోపించారు.



### డిగ్రీ విద్యార్థులకు బోలెడు శుభవార్తలు చెప్పిన

# ఉన్నత విద్యామండలి

తెలంగాణ డిగ్రీ విద్యార్థులకు గుడ్ న్యూస్ వచ్చేసింది. వచ్చే అకడమిక్ (2025-26) నుంచి డిగ్రీ విద్యలో విప్లవాత్మక మార్పులు రాబోతున్నాయి. డిగ్రీలో ఇప్పటివరకు సెమిస్టర్ ఎగ్జామ్స్‌కు 80 మార్కులు, ఇంటర్నల్‌కు 20 మార్కులు కేటాయించేవారు. UGC (యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్) స్వయం ప్రతిపత్తి హోదా ఉన్న కాలేజీల్లో మార్కుల కేటాయింపు 70:30గా మార్చుకునేందుకు అవకాశం ఉండేది. ఇకపై సెమిస్టర్ ఎగ్జామ్స్ 50 మార్కులకే నిర్వహించనున్నారు. మిగిలిన 50 మార్కుల్లో- - - ప్రాజెక్టు వర్క్/ అసైన్‌మెంట్‌కు 25 మార్కులు, మిడ్‌టర్మ్ ఎగ్జామ్స్‌కు 25 మార్కులు కేటాయింపు చేయనున్నారు. అంటే కంటిన్యువస్ అసెస్‌మెంట్ ప్యాటర్న్-క్యాప్ సిస్టమ్ అమలు చేయబోతున్నారు. విశ్వవిద్యాలయాల ఉపకులపతుల సమావేశంలో .. తెలంగాణ ఉన్నత విద్యామండలి ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ఛైర్మన్ ఆచార్య వి.బాలకిష్టా రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో.. సిలబస్, ఎగ్జామ్స్, ఎంట్రన్స్ వంటి అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకున్నారు.దోస్త్‌లో భాగంగా డిగ్రీలో 4 కేటగిరీల నుంచి 3 సబ్జెక్టులను ఎంచుకునే బకెట్ విధానంపై మీటింగ్‌లో సుదీర్ఘ చర్చ జరిగింది. ఈ పద్ధతి కారణంగా కొన్ని సబ్జెక్టులను అతి తక్కువ మంది, మరికొన్ని సబ్జెక్టులను అతి తక్కువ మంది ఎంపిక చేసుకుంటున్నారని లెక్కలు స్పష్టం చేస్తున్నాయి. దీంతో ఈ విధానాన్ని సమర్థంగా అమలు చేయడం ఇబ్బందికరంగా మారుతోందనే అభిప్రాయం పలువురి నుంచి వ్యక్తమైంది. దీంతో ఆ విధానాన్ని తొలగించి.. మార్పులు చేయాలని నిర్ణయించారు. UGC స్వయంప్రతిపత్తి కాలేజీల్లో బకెట్ విధానం అమలు, పర్యవేక్షణకు విధి విధానాలు త్వరలో రూపొందించనున్నారు. ఇక డిగ్రీలోని 6 సెమిస్టర్ల షెడ్యూల్స్ ఫైనల్ చేశారు. ఫస్ట్ సెమిస్టర్ క్లాసెస్ జూన్ 16వ తేదీ నుంచి, పరీక్షలు నవంబరు 6వ తేదీ నుంచి మొదలవుతాయి. 3, 5 సెమిస్టర్ల క్లాసెస్ జూన్ 2 నుంచి, రెండు, 4, 6 సెమిస్టర్ల క్లాసెస్ నవంబరు 20 నుంచి స్టార్టవుతాయి.



## హాట్ ఫొటోలతో అనన్య పాండే

అనన్య 2019లో "స్టూడెంట్ ఆఫ్ ది ఇయర్ 2" చిత్రంతో సినీ రంగంలోకి అడుగుపెట్టింది. ఈ సినిమాలో ఆమె నటనకు ఫిల్మ్‌ఫేర్ అవార్డు ఫర్ బెస్ట్ ఫీమేల్ డెబ్యూ కూడా లభించింది. ఆతర్వాత వరుసగా సినిమాలు చేసి ప్రేక్షకులను ఆకట్టుకుంది ఈ చిన్నది. అనన్య తన కెరీర్‌లో పతి పత్నీ ఔర్ వో, లైగర్, డ్రీమ్ గర్ల్ 2 వంటి చిత్రాల్లో నటించింది.బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే టాలీవుడ్ ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలే. ఈ ముద్దుగుమ్మ 1998 అక్టోబర్ 30న ముంబైలో జన్మించింది. ఆమె తండ్రి చంకీ పాండే కూడా బాలీవుడ్‌లో ప్రముఖ నటుడు, తల్లి భావనా పాండే ఒక కాస్ట్యూమ్ డిజైనర్.బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే టాలీవుడ్ ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలే. ఈ ముద్దుగుమ్మ 1998 అక్టోబర్ 30న ముంబైలో జన్మించింది. ఆమె తండ్రి చంకీ పాండే కూడా బాలీవుడ్‌లో ప్రముఖ నటుడు, తల్లి భావనా పాండే ఒక కాస్ట్యూమ్ డిజైనర్.బాలీవుడ్ బ్యూటీ అనన్య పాండే టాలీవుడ్ ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలే.

## 3,354కు చేరిన మయన్మార్ భూకంపం మృతుల సంఖ్య

మయన్మార్‌లో మృత్యుఘోష కొనసాగుతోంది. వారం రోజుల క్రితం అక్కడ సంభవించిన భూకంపం ఘటనలో మృతుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. తాజా సమాచారం ప్రకారం ఈ భూవిలయంలో మరణించిన వారి సంఖ్య 3,354కు చేరింది. 4,850 మంది గాయాలపాలయ్యారు. 220 మంది ఆచూకీ గల్లంతైనట్లు స్థానిక మీడియా శనివారం వెల్లడించింది.గత నెల 28 మధ్యాహ్నం సమయంలో మయన్మార్‌లో భారీ భూకంపం సంభవించిన విషయం తెలిసిందే. నిమిషాల వ్యవధిలోనే 7.7, 6.3 తీవ్రతతో భూమి కంపించింది. ఈ ప్రకంపనలకు రోడ్లు, వంతెనలు, ఇళ్లు దెబ్బతిన్నాయి. అనేక భవనాలు నేలమట్టమయ్యాయి. ప్రభావిత ప్రాంతాల్లో పలు దేశాల రెస్క్యూ సిబ్బంది సహాయచర్యలు కొనసాగిస్తున్నారు.





### ఆగి ఉన్న ట్రక్కును ఢీ కొట్టిన వ్యాను..

## ఐదుగురు మృతి

కర్ణాటక రాష్ట్రంలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కలబురగి జిల్లాలో ఆగిఉన్న ట్రక్కును ఓ వ్యాను బలంగా ఢీ కొట్టింది. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోగా.. అనేకమంది గాయాలపాలయ్యారు. కలబురగి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం తెల్లవారుజామున 3:30 గంటల ప్రాంతంలో జిల్లాలోని నెలోగి క్రాస్ సమీపంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఐదుగురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోయారు. సుమారు 10 మంది గాయపడ్డారు. ప్రమాద సమాచారం అందుకున్న కలబురగి పోలీసులు ఘటనాస్థలికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం కలబురగి ఆసుపత్రికి తరలించారు. మృతులను బాగల్‌కోట్ జిల్లా వాసులుగా గుర్తించారు. ఈ ఘటనపై నెలోగి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైనట్లు కలబురగి పోలీసులు తెలిపారు.

## అధ్యక్ష పదవిపై స్పందించిన అన్నామలై

తమిళనాడు రాష్ట్ర బీజేపీ నూతన అధ్యక్షుడి నియామకంపై ఆ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి రేసులో తాను లేనని ఆయన స్పష్టం చేశారు. పలు రాష్ట్రాల్లో నూతన అధ్యక్షుల నియామకంపై బీజేపీ అధిష్ఠానం కసరత్తు చేస్తోంది. ఈ సమయంలో అన్నామలై చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.తమిళనాడులో బీజేపీ నాయకత్వం కోసం నేతలు ఎవరూ పోటీ పడరని, అందరం కలిసి ఏకగ్రీవంగా ఒక నాయకుడిని ఎన్నుకుంటామని అన్నామలై తెలిపారు. తాను కూడా ఈ రేసులో లేనని ఆయన స్పష్టం చేశారు. పార్టీకి మంచి భవిష్యత్తు ఉండాలని కోరుకుంటున్నానని ఆయన అన్నారు.పార్టీ ప్రగతి కోసం ఎంతోమంది తమ ప్రాణాలను అర్పించారని ఆయన గుర్తు చేశారు. బీజేపీ ఎప్పటికీ బాగుండాలని కోరుకునే వ్యక్తిని అని అన్నామలై అన్నారు. తాను ఎలాంటి రాజకీయ ఊహాగానాలపై స్పందించలేనని ఆయన తేల్చి చెప్పారు. ఇతర పార్టీల మాదిరిగా బీజేపీలో అధ్యక్ష పదవి కోసం 50 మంది నేతలు నామినేషన్ వేసే పరిస్థితి ఉండదని ఆయన అన్నారు.

